సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



వనదేవతకు వందనం

బుట్టాయగూడెం: మారుమూల కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



రెండు మోటార్ సైకిళ్ల ఢీ

అలంపురం వద్ద జాతీయ రహదారిపై రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. 8లో ▸



ఆర్టీసీకి జవసత్వాలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సంచలనంగా నిలిచింది. ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారమైంది. 8లో ▸

న్యూస్‌రీల్

మేనిఫెస్టోపై సర్వత్రా సంతోషం



గ్రంధి శ్రీనివాస్ ప్రభుత్వ విప్

భీమవరం: అన్నివర్గాలకు మేలుచేసే వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి జిల్లా కేంద్రాన్ని రూ.2 వేల కోట్లతో స్మార్ట్ సిటీగా తయారు చేస్తామని వెల్లడించడంతో భీమవరం రాబోయే రోజుల్లో స్మార్ట్ సిటీగా తయారవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, రైతులు, మహిళల బలోపేతానికి ప్రాధాన్యమిచ్చారన్నారు. 2014లో చంద్రబాబు బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి 600లకు పైగా హామీలిచ్చి ఒక్క హామీని కూడా అమలు చేయలేదని గుర్తుచేశారు. ఇప్పుడు మరలా మోసం చేయడానికి అమలు కాని వాగ్దానాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు హామీలను ప్రజలు ఎన్నటికీ నమ్మరని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

వేగంగా గుర్తుల కేటాయింపు



సూచనలిస్తున్న కలెక్టర్ సుమీత్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): నామినేషన్ల ఉపసంహరణ అనంతరం నిర్వహించే ప్రక్రియకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహిస్తామని, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించి వెంటనే తెలియజేయాలన్నారు. అభ్యర్థుల పేర్లను ప్రామాణికంగా తెలుగు వర్ణమాల ప్రకారం బ్యాలెట్‌లో వరుస క్రమాన్ని నిర్ణయించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ ముద్రణ, సర్వీస్ ఓటర్ల కోసం ఈటీపీబీఎస్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపై నిఘా



ఎం. అచ్యుత్ అంబరీష్, ఆర్డీఓ

నరసాపురం: ఎన్నికల దృష్ట్యా మద్యం అమ్మకాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టామని నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మద్యం సరఫరా జరగకుండా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎక్కడైనా మద్యం నిల్వలు ఉన్నట్టు తెలిసినా, అక్రమ అమ్మకాలు సాగిస్తున్నట్టుగా సమాచారం ఉన్నా అధికారులకు తెలియజేయాలన్నారు. ఆర్డీఓ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేసినా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఏ మద్యం దుకాణంలోనైనా సాధారణ స్థాయికి మించి అమ్మకాలు జరిగితే అధికారులకు తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చారు. నరసాపురం నియోజకవర్గానికి ఓటరు స్లిప్పులు రానున్నాయని, పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. హోమ్ ఓటింగ్‌కు చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు.


ఆటో డ్రైవర్ల హర్షాతిరేకాలు



భీమవరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

భీమవరం: వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో వాహనమిత్ర పథకం కొనసాగిస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ మాట్లాడుతూ ఆటోవాలాలకు వాహన మిత్ర కొనసాగించడంతో పాటు ఆటోలపైనే ఆధారపడి జీవిస్తున్న కార్మికులు పొట్టకొట్టే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం లేకపోవడం ఆటో వర్కర్లకు ఊరటనిచ్చిందన్నారు. అలాగే ఆటో డ్రైవర్ల ప్రమాద బీమా రూ.10 లక్షలు వర్తింపజేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ఆటోవర్కర్లంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పంపన గోపి, కేతన్, ప్రకాష్, ఏసు, సూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రాన్ ప్రతిష్ఠ



ఆకాంక్షలు ఫలించె..

- ఆక్వా రైతులకు వెన్నుదన్నుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రపంచంలోనే రెండో సంస్థగా 'అప్సడా' ఏర్పాటు
- ఫీడ్, ప్రాసెసింగ్ కంపెనీలు, హేచరీల ఆగడాలకు అడ్డుకట్ట
- 3,46,000 ఎకరాలకు పెరిగిన ఆక్వా జోన్ పరిధి
- పది ఎకరాలలోపు రైతులకు రూ.1.50కే సబ్సిడీపై విద్యుత్
- గత ప్రభుత్వ బకాయిలు రూ. 340 కోట్లను చెల్లించిన ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా 3,000 ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌లు
- నరసాపురంలో రూ.332 కోట్లతో ఆక్వా వర్సిటీకి శ్రీకారం

అయ్యో.. రొయ్య అనే దుస్థితి నుంచి ఆక్వా.. కెవ్వు కేక అనే స్థితికి ఆక్వా రంగం వృద్ధి చెందింది. దళారుల దోపిడీ, గిట్టుబాటు కాని ధరలు, నకిలీ సీడ్, పెరిగిన మేత రేట్లతో కుదేలైన ఈ రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త ఊపిరిలూదింది. ప్రపంచంలోనే రెండోదిగా ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) ఏర్పాటు చేసింది. 90 వేల ఎకరాలకే పరిమితమైన జోన్ పరిధిని ఐదేళ్లలో 3.46 లక్షల ఎకరాలకు విస్తరించింది. విద్యుత్ సబ్సిడీ రూపంలో రూ.3,420 కోట్లు అందజేసింది. ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ల ఏర్పాటుతో గృహ వినియోగం పెరిగింది. దేశంలోనే బెస్ట్ మెరైన్ అవార్డుతో ఏపీ కీర్తిని దశదిశలా వ్యాపింపజేసింది.



సాక్షి, భీమవరం: రాష్ట్రంలోని ఏలూరు, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, నెల్లూరు తదితర జిల్లాల్లోని 4.65 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, ప్రకాశం జిల్లాల్లో టైగర్ జాతికి చెందిన మోనోడా, కోస్తా ఏరియాలో వనామీ సాగుచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 వరకు హేచరీలు, 130 వరకు ప్రాసెసింగ్ యూనిట్లు, 34 ఫీడ్ కంపెనీలు ఉన్నాయి. చైనా, అమెరికా, జపాన్, ఇండోనేషియా తదితర దేశాలకు ఏటా రూ.45 వేల కోట్ల ఎగుమతులు జరుగుతుంటే అందులో రూ.37 వేల కోట్ల ఎగుమతులతో ఏపీ అగ్రస్థానంలో ఉన్నా రైతుకు సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి గత ప్రభుత్వంలో ఉండేది.

ప్రపంచంలోనే రెండోదిగా అప్సడా

ఆక్వా రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం 2020లో ప్రత్యేకంగా అప్సడాను ఏర్పాటుచేసింది. ప్రపంచంలోనే ఇది రెండోది కావడం గమనార్హం. అప్సడాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చైర్మన్‌గా, తాడేపల్లిగూడేనికి చెందిన ఆక్వా రైతు వడ్డి రఘురాం వైస్ చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

కొత్త శకం ఆరంభం

కోస్తా ఆక్వాకల్చర్ అథారిటీ (సీఏఏ) నిబంధనల ప్రకారం ఆక్వా జోన్ పరిధిలోని రైతులకు మాత్రమే ప్రభుత్వ లబ్ధి చేకూరుతుంది. ఈ ఫిష్ సర్వే ద్వారా 10 ఎకరాలలోపు ఉన్న రైతులందరినీ అప్సడా ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకువచ్చింది. చంద్రబాబు హయాంలో జోన్ పరిధిలో కేవలం 90 వేల ఎకరాలు మాత్రమే ఉండగా ఇప్పుడు 3.46 లక్షల ఎకరాలకు పెరగడం గమనార్హం. అప్సడా రాకతో హేచరీలు, ఫీడ్, ప్రాసెసింగ్ కంపెనీలకు ఆగడాలకు చెక్ పెట్టారు. ప్రాసెసింగ్ కంపెనీలతో మాట్లాడి 10 రోజుల పాటు ధరలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. మేత ధరలను నియంత్రించారు. అనుమతులు లేని హేచరీల తొలగింపుతో పాటు రైతులకు నాణ్యమైన సీడ్ అందించే ఏర్పాట్లు చేశారు.

రూ. 3,420 కోట్ల విద్యుత్ సబ్సిడీ

సబ్సిడీపై యూనిట్ రూ.2కే అందజేస్తామంటూ గత టీడీపీ ప్రభుత్వం డిస్కింలకు రూ.340 కోట్లు బకాయిలు పెడితే రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఆ మొత్తాన్ని జగన్ సర్కార్ చెల్లించింది. రాష్ట్రంలో మొత్తం 63 వేల విద్యుత్ కనెక్షన్లకు గాను జోన్ పరిధిలో 54,080 కనెక్షన్లు క్రమబద్ధీకరించి సబ్సిడీపై రూ.1.50కే విద్యుత్‌ను అందజేస్తోంది. చెరువులతో పాటు అనుబంధంగా ఉండే హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లకు నిరంతర విద్యుత్ సదుపాయంతో పాటు కనెక్షన్ల మంజూరు ప్రక్రియను సులభతరం చేసింది. సబ్సిడీ రూపంలో రూ. 3,420 కోట్లు ఆక్వా రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేయడం గమనార్హం.

దేశంలోనే మూడో ఆక్వా వర్సిటీ ఏర్పాటు

మత్స్య ఎగుమతులు, మత్స్య సాగులో శాస్త్రీయ పద్ధతులు పెంచేందుకు నరసాపురం మండలం సరిపల్లి వద్ద మత్స్య యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దేశంలోనే ఇది మూడోది కావడం గమనార్హం. రూ.332 కోట్ల వ్యయంతో 40 ఎకరాల స్థలంలో వర్సిటీ పరిపాలన భవనం, హాస్టళ్లు, వీసీ ఛాంబర్ పనులు జరుగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి లక్ష్మణేశ్వరం తుపాను రక్షిత భవనంలో ఆక్వా కోర్సులు ప్రారంభించారు.





బీమాకు పైలెట్ ప్రాజెక్టుగా ఏపీ : నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ), సీబా సహకారంతో 5 ఎకరాలలోపు ఆక్వా రైతులకు బీమా సదుపాయం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్రంతో మాట్లాడి రాష్ట్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసేందుకు సీఎం జగన్ కృషి చేశారు. ఆమోదయోగ్యమైన పాలసీ కోసం బీమా కంపెనీలతో అప్సడా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

విశాఖలో రూ.36 కోట్లతో బీఎంసీ

రాష్ట్రంలోని రైతులు దేశంలోనే అత్యధిక ఉత్పత్తి చేస్తున్నా స్థానికంగా బ్రూడల్ స్టాక్ మెయింటెనెన్స్ సెంటర్ (బీఎంసీ) ఏర్పాటుచేసే దిశగా గత ప్రభుత్వాలేవీ ఆలోచన చేయలేదు. సీడ్ కోసం విదేశాల నుంచి తీసుకువచ్చే తల్లి రొయ్యలను క్వారంటైన్ నిమిత్తం చెన్నైలోని బీఎంసీకి తీసుకువెళ్లేందుకు రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం విశాఖ జిల్లా నక్కపల్లి మండలం బంగారుపేటలో రూ.36 కోట్లతో బీఎంసీ ఏర్పాటు చేసి ఆగస్టు నాటికి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంది.

ఫిష్ ఆంధ్రాకు శ్రీకారం : స్థానిక వినియోగం పెంచడం ద్వారా రైతులకు లాభసాటి ధర అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టింది. రోజుకు 2,000 నుంచి 2,500 టన్నులు స్థానిక మార్కెట్లలో అమ్ముకునే విధంగా 3,000 అవుట్‌లెట్లు ఏర్పాటు చేసి ఎక్స్‌పోర్ట్ ఉత్పత్తులను స్థానికంగా అందిస్తున్నారు. 13 సార్లు ప్రాన్ అండ్ ఫిష్ ఫెస్టివల్స్ నిర్వహించారు. గత ప్రభుత్వంలో కేవలం రెండు శాతం ఉన్న డొమెస్టిక్ వినియోగం ఇప్పుడు 35 శాతానికి పెరిగింది.

కరోనా కష్టకాలంలో అండగా..



కోవిడ్ సమయంలో రైతుల భయాన్ని ఆసరాగా చేసుకుని ప్రాసెసింగ్ యూనిట్లు 100 కౌంట్ రూ.80, రూ.90కు కొనే పరిస్థితులు నెలకొంటే ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. 100 కౌంట్ రొయ్యలను రూ.180 ఎంఎస్‌పీగా నిర్ణయం ఇతర రాష్ట్రాల్లో మాదిరి ఆక్వా రంగం కుదేలవ్వకుండా కాపాడింది. దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఆక్వాను నిలిపారు.

– వడ్డి రఘురాం, అప్సడా వైస్ చైర్మన్

కూటమిలో రెబల్స్ కుంపట్లు

నూజివీడు, పోలవరం, ఉండిలో టీడీపీ రెబల్స్ నామినేషన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి పార్టీల్లో రెబల్ కుంపట్లు చిచ్చు రేపుతున్నాయి. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మూడు చోట్ల టీడీపీ రెబల్స్ నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏలూరు జిల్లా నూజివీడులో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు టీడీపీ సీటివ్వకుండా మొండిచేయి చూపడంతో ఆయన ఈనెల 18న రెబల్‌గా నామినేషన్ దాఖలు చేశారు. పోలవరంలో రెబల్ అభ్యర్థిగా టీడీపీ నేత మొడియం సూర్యచంద్రరావు ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. నిజానికి కూటమి పార్టీల పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరఫున చిర్రి బాలరాజు ఈనెల 18వ తేదీనే నామినేషన్ వేశారు. కాగా.. జనసేన అభ్యర్థి బాలరాజుకు పోటీగా టీడీపీ నేత సూర్యచంద్రరావు నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది.

ఉండిలోనూ రెబల్ పోటీ

ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున వేటుకూరి శివరామరాజు 2009, 2014 ఎన్నికల్లో గెలుపొందారు. 2019లో నరసాపురం టీడీపీ ఎంపీగా అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో తన శిష్యుడు మంతెన రామరాజును గెలిపించిన శివరామరాజు.. 2024 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరిగి పోటీకి దిగుతానని చెప్పుకున్నారు. శివరామరాజును కాదని.. ఆయన శిష్యుడు రామరాజును అభ్యర్థిగా ప్రకటించిన టీడీపీ చివరి క్షణంలో ఎంపీ రఘురామకృష్ణరాజుకు అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో టీడీపీ రెబల్ అభ్యర్థిగా వేటుకూరి శివరామరాజు నామినేషన్ దాఖలు చేశారు. రామరాజుకు సీటు కేటాయిస్తున్నట్టు టీడీపీ ప్రకటించిన నాటి నుంచే శివరామరాజు రెబల్ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల మధ్య అసలు పొసగడం లేదు. ఇక్కడ తలెత్తిన విభేదాలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు.

మేనిఫెస్టో హామీలన్నీ అమలు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



మాట్లాడుతున్న శ్రీరంగనాథరాజు, ఉమాబాల

పెనుగొండ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు పరిచే ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రజలు నమ్ముతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం తూర్పుపాలెంలో పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలిసి ఆయన మేనిఫెస్టో విడుదల చేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా అమలు చేశారని, ఆచరణలో అమలు చేయగల హామీలనే ఇచ్చి అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ అమ్మఒడి, రైతుభరోసాను మరింత పెంచడంతో పాటు విద్య, వైద్యరంగాలకు అధిక నిధులు కేటాయించి వెనుదన్నుగా నిలిచారన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీలను ఏనాడూ అమలు చేయలేదని, మభ్యపెట్టే హామీలు ఇచ్చి మోసగించడం ఆయన నైజమన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద) తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 14.72 లక్షలు

- ఓటర్ల తుది జాబితా విడుదల
- మొత్తం ఓటర్లు 14,72,923
- కొత్తగా పెరిగిన ఓటర్లు 11,585
- అత్యధికంగా భీమవరం, అత్యల్పంగా నరసాపురం
- గత ఎన్నికల కంటే 7.49 శాతం ఓట్ల పెరుగుదల



సాక్షి, భీమవరం: 2024 సార్వత్రిక సమరానికి సన్నద్ధం చేస్తూ ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. జిల్లాలోని 1,471 పోలింగ్ కేంద్రాల్లో 14,72,923 మంది ఓటర్లు అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించనున్నారు. వీరిలో పురుషులు 7,21,532, మహిళలు 7,51,313, ఇతరులు 78 మంది ఉన్నారు. పురుషులతో పోలిస్తే 29,781 ఓట్లతో మహిళలదే పైచేయిగా ఉంది.

చేర్పులు, మార్పులతో..

కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల్లో భాగంగా ఎన్నికల కమిషన్ గత ఏడాది ఏప్రిల్ 15 నుంచి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 చేపట్టింది. అక్టోబరు 28న ముసాయిదా జాబితా విడుదల చేసింది. జనవరి 5న తుది జాబితా ప్రచురించాల్సి ఉండగా ఎన్నికల ఏడాది కావడంతో కొత్త ఓటర్ల నమోదుకు జనవరి 12వ తేదీ వరకు ఈసీ గడువు పొడిగిస్తూ వచ్చింది. స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 18 ఏళ్లు నిండిన యువతకు కొత్తగా ఓటు హక్కు కల్పించారు. పర్సన్ విత్ డిజేబుల్డ్ (దివ్యాంగులు)కు సంబంధించి ఓట్లు నమోదులో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ చనిపోయిన, డూప్లికేట్ ఓట్లు తొలగించారు. ఒకే డోర్ నంబర్‌లో 10కి పైగా ఉన్న ఓట్లు విషయంలో ఈసీ మార్గదర్శకాలు మేరకు సరిచేశారు. ఓటరు జాబితాలో సవరణలు, అడ్రస్ మార్పులు తదితర ప్రక్రియలన్నింటినీ పూర్తిచేశారు. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రగతిని వివరిస్తూ పారదర్శకంగా జాబితాలను సిద్ధం చేశారు. నిర్ణీత షెడ్యూల్ మేరకు జనవరి 22న తుది జాబితాను విడుదల చేశారు.

మరో అవకాశంతో పెరిగిన ఓటర్లు

ఎన్నికల దృష్ట్యా 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఈసీ నామినేషన్ ప్రకియ వరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు మరో అవకాశం కల్పించింది. జనవరిలో విడుదలైన తుది జాబితాలో జిల్లాలో 14,61,338 మంది ఓటర్లు ఉండగా తాజాగా విడుదల చేసిన తుది జాబితా మేరకు 14,72,923 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,21,532, మహిళలు 7,51,313, ఇతరులు 78 మంది ఉన్నారు. కొత్తగా 11,585 మంది ఓటర్లు పెరిగారు. సీనియర్ సిటిజన్లు 7,803 మంది ఉండగా యువత 38,188 మంది ఉండగా, పీడబ్ల్యూడీ ఓటర్లు 20,132 మంది వరకు ఉన్నారు. ఉన్నారు. కలెక్టరేట్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో తుది ఓటర్ల జాబితాలను ప్రచురించారు.

7.49 శాతం ఓట్ల పెరుగుదల

గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో 7.49 శాతం మేర ఓటర్ల పెరుగుదల కనిపిస్తోంది. 2019 ఎన్నికల నాటికి జిల్లాలో 13,62,654 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుత ఎన్నికలకు 14,72,923కు పెరిగారు. తాజా జాబితాలో 1,10,269 ఓట్లు పెరిగాయి. జిల్లాలో భీమవరం నియోజకవర్గంలో అత్యధికంగా 2,53,116 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా నరసాపురం నియోజకవర్గంలో 1,70,448 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు



నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
భీమవరం	1,22,790	1,30,275	51	2,53,116	235
ఆచంట	88,881	91,132	4	1,80,017	187
పాలకొల్లు	95,742	99,309	6	1,95,057	190
నరసాపురం	84,667	85,781	0	1,70,448	169
ఉండి	1,10,146	1,14,577	2	2,24,725	248
తణుకు	1,14,435	1,20,135	5	2,34,575	233
తాడేపల్లిగూడెం	1,04,871	1,10,140	10	2,14,985	209

ఎన్నికల ఖర్చుపై పర్యవేక్షణ తప్పనిసరి

భీమవరం(ప్రకాశం చౌక్): ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువులు తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషిచేయాలన్నారు. పార్టీలు లేదా అభ్యర్థులు అనధికారికంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడానికి వీలు లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, విస్తృత తనిఖీలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీతోనే భీమవరం అభివృద్ధి



భీమవరంలో ఆర్యవైశ్య, వర్తకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం: భీమవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి తనకు సహకరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్యుల, వర్తకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల పునర్విభజనలో ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరాన్ని కేంద్రం చేయడానికి చేసిన కృషి ఫలించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంగీకరించారన్నారు. ఇందు కోసం తాను మంత్రి పదవిని సైతం వదలుకున్నానన్నారు. గడిచిన 58 నెలల కాలంలో పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మంచినీటి సరఫరాను మెరుగుపరిచామని, రైల్వే అండర్ టన్నెల్స్ నిర్మించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించామన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం తుదిదశలో ఉందని, యనమదుర్రు డ్రెయిన్‌పై మరోఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు చెప్పారు. యనమదుర్రు డ్రెయిన్‌పై మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేయించామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో మరోసారి తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరి జగదీష్, మానేపల్లి నాగన్న బాబు, కురిశేటి కాశి, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, అగర్వాల్, తట్టవర్తి నారాయణ, వబిలిశెట్టి పార్థసారథి, కురిసేటి సత్యనారాయణ, పెరుమాళ్ళ సత్తిబాబు, తోట భోగయ్య, కామన నాగేశ్వరరావు, కొప్పర్తి జనార్ధన్, బొర్రా వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ నృత్య దినోత్సవ కార్యక్రమాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ప్రత్యేక నృత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కళారత్న కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఉభయ గోదావరి జిల్లాల్లో శాస్త్రీయ నృత్య కళారంగంలో విశిష్టులైన నృత్య గురువుల నిర్వహణలో 120 మందికి పైగా నృత్య విద్యార్థుల ప్రదర్శనలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నృత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నాట్యంలో తర్ఫీదు పొందిన విద్యార్థులు బృంద నృత్యాలు, కూచిపూడి శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులుగా శాస్త్రీయ నృత్య శిక్షణారంగంలో విశేష సేవలు అందిస్తున్న 11 మందికి నృత్య గురువులకు ఆత్మీయ సత్కారం ఉంటుందని పేర్కొన్నారు.

జగన్‌తో ఆర్టీసీకి జవసత్వాలు

- ప్రభుత్వంలో విలీనంతో ఆర్టీసీకి జీవం పోసిన జగన్
- సీఎం సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగుల కల సాకారం
- ఉద్యోగ భద్రతతో ఊపిరి పీల్చుకున్న సంస్థ సిబ్బంది
- లాభనష్టాలతో నిమిత్తం లేకుండా సకాలంలో జీతాలు
- ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో 2,296 మంది ఆర్టీసీ ఉద్యోగులు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగుల భద్రతలపై అనేక ప్రజాదరణ పథకాలు, విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్న వైఎస్ జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయం సంచలనాలకే సంచలనంగా మారింది. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కావాలన్న ఉద్యోగుల చిరకాల స్వప్నాన్ని జగన్ సాకారం చేశారు. దీంతో అభద్రతాభావంతో ఉన్న సంస్థ ఉద్యోగులకు జగన్ వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చారు. గతంలో కేంద్రంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా రాజకీయ వైతాళికునిగా తనను తాను చిత్రించుకునే చంద్రబాబుగానీ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే సాహసం చేయలేకపోయారు.



ఏలూరు డిపో గ్యారేజ్‌లో ఆర్టీసీ బస్సులు

ఏలూరు (ఆర్ఆర్ పేట) : ఆర్టీసీ సంస్థ ఉంటుందా.. ఎప్పుడూ నష్టాల్లోనే.. ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి.. నాలుగేళ్లకోసారి జీతాల ఫిట్‌మెంట్ చేయాల్సిన నిబంధన ఉన్నా ఎంత మేరకు అమలు చేస్తారు.. సంస్థను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందట.. మన ఉద్యోగాలు ఉంటాయా.. ఉంటే జీతాలు ఇప్పుడు ఇచ్చినట్టుగానే ప్రైవేట్ సంస్థ ఇస్తుందా.. ఇదీ 2019 ముందు వరకు ఆర్టీసీ ఉద్యోగులను తీవ్రంగా కలచి వేసిన ప్రశ్నలు. సవాలక్ష ఆలోచనలతో ఉద్యోగులు దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టుగా సంస్థలో కొనసాగేవారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలన్నీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ దశాబ్దాల తరబడి పోరాటాలు చేసినా ఏ ప్రభుత్వమూ వారి మొర ఆలకించిన పాపాన పోలేదు. అటువంటి తరుణంలో 2019వ సంవత్సరంలో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న కీలక నిర్ణయంతో ఆర్టీసీ బతికింది.

తొలినాళ్లలో ఏకఛత్రాధిపత్యం

ఆర్టీసీ సంస్థ ప్రారంభించిన తొలినాళ్లలో ప్రజలకు ప్రత్యామ్నాయ రవాణా సాధనాలు లేకపోవడంతో ప్రజా రవాణా రంగంలో ఆర్టీసీ బస్సులు ఏకఛత్రాధిపత్యంతో నడిచాయి. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రజల ఆదాయ మార్గాలు గణనీయంగా పెరగడంతో అందరికీ సొంతంగా ద్విచక్రవాహనాలు అందుబాటులోకి రావడం, ప్రజారవాణాలో ప్రైవేట్ వాహనాలు చొచ్చుకురావడంతో ఆర్టీసీ పతనం దిశగా అడుగులు వేసింది. ఈ నేపథ్యంలో నిర్వహణ సంస్థకు భారంగా మారడంతో ప్రతి ఏటా నష్టాలను చవిచూసింది. ఇటువంటి పరిస్థితిలో 2005వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీని ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారనే వార్త ఆర్టీసీ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అలజడిని రేపింది. ఆర్టీసీని తొలుత రామోజీరావుకు, అనంతరం ఎస్ఆర్ఎంటీ సంస్థకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారని విశ్వసనీయంగా తెలియడంతో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు రోడ్డెక్కి గట్టి ఆందోళన చేయడంతో చంద్రబాబు వెనక్కి తగ్గినట్లు అప్పట్లో పోరాటాలు చేసిన యూనియన్ నాయకులు చెబుతున్నారు. ఆ తరువాత మరోసారి చంద్రబాబు రిలయన్స్ సంస్థకు ఆర్టీసీని కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారనే విషయం వెలుగు చూడడం.. ఉద్యోగులు మళ్లీ రోడ్డెక్కడంతో ఆ ప్రతిపాదన విరమించుకోవడం జరిగిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆర్టీసీ ఉద్యోగులు గుండెల మీద చేయివేసుకుని ప్రశాంతంగా పని చేసుకోగలుగుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు వర్తింపు..

ఉమ్మడి జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, నరసాపురం డిపోల్లో మొత్తం 2,296 ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో ఏలూరు జిల్లాలో మొత్తం 1,074 మంది ఉద్యోగులు ఉండగా, వారిలో 408 మంది డ్రైవర్లు, 406 మంది కండక్టర్లు, 260 మంది ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,222 మంది ఉద్యోగులు ఉండగా వారిలో 456 మంది కండక్టర్లు, 443 మంది డ్రైవర్లు, మరో 323 మంది ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వ ఉద్యోగులకు అందే ప్రయోజనాలు అన్నీ అందుతున్నాయి.

ఆర్టీసీ, ప్రైవేట్‌కు సమానంగా ఇంధన పన్ను

సంస్థ నష్టాల్లో నడుస్తుండడంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం సంస్థ లాభనష్టాలను బేరీజు వేసుకుని జీతాలు చెల్లించే విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు. ఉద్యోగుల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా ఆ ఆలోచనను విరమించుకున్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయ రవాణా సాధనాలు అందుబాటులోకి రావడం, ఆర్టీసీ వినియోగించే ఇంధనంపై పన్ను ప్రైవేటు వాహనాలకు ఇచ్చే ఇంధనంపై వసూలు చేసే పన్ను కంటే అధికంగా ఉండడంతో ఆర్టీసీకి నష్టాలు వస్తున్నాయని అప్పట్లో ఉద్యోగులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. అనంతరం వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ పన్నును ఆర్టీసీకి, ప్రైవేటుకు సమానంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు మరింత ఉద్యోగ భద్రత చేకూరడంతో పాటు వారికి ట్రెజరీల ద్వారా జీతాల చెల్లింపులు ప్రారంభమయ్యాయి. అలాగే గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచి ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం వర్తింపచేయలేదు. ప్రస్తుతం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల్లానే ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెరగడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

జగనన్నతోనే రాష్ట్రానికి మేలు

బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ప్రచారంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



బ్రహ్మానందరెడ్డి మార్కెట్ జట్టు కూలీలను తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్న కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: 'నా తండ్రి కాలం నుంచి బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో పచ్చి వ్యాపారం చేస్తున్నామని, నా చిన్నతనం నుంచి నన్ను ఆదరించిన మార్కెట్‌లోని జట్టు కూలీలు, వ్యాపారస్తులు అందరూ మా కుటుంబ సభ్యులేనని' ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో, 33వ వార్డు ఎఫ్‌సీఐ కాలనీలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార సమావేశాల్లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ మాట్లాడారు. తాను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. 2004–2009, 2019–2024 కాలంలో తాను చేసిన అభివృద్ధి మాత్రమే ఇప్పటికీ కనబడుతోందన్నారు. వ్యాపారస్తులకు, మార్కెట్‌లోని కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, పట్టాలు ఇచ్చేందుకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించి పట్టాలు ఇచ్చే అవకాశం ఉంటే తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు. అప్పుడా వైస్ చైర్మన్ వడ్డి రాఘురాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అయిన ఏసీ రైతు బజారును పట్టణానికి రాకుండా జనసేన పార్టీ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, అవినీతికి రూపంగా ముళ్లపూడి బాపిరాజుతో కలిసి కుట్ర చేసి అడ్డుకున్నారన్నారు. కొట్టు సత్యనారాయణకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వ్యాపారస్తులు అర్జునరావు, నాగేశ్వరరావు, నాయకులు చీకటిమిల్లి మంగరాజు, దాసి బాబు, కొల్లాటి బాలాజీ, కొలుకులూరి ధర్మరాజు, నిమ్మల నాని, గొర్రెల శ్రీనివాస్, బండారు నాగు, చెన్నా జనార్ధన్, దేవాబత్తుల సూర్యనారాయణ, కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

పసలదీవి ప్రచారంలో చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు



పసలదీవిలో ప్రచారం చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం పసలదీవి గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులను పలుకరిస్తూ తమ ప్రభుత్వాన్ని ఎందుకు మళ్లీ గెలిపించాలో వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో పలు చోట్ల ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు గడపగడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచార కరపత్రాలను అందజేశారు. ప్రతీ ఓటరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బొక్కా రాధాకృష్ణ, పులపర్తి త్రిమూర్తులు, కొట్టు వెంకట్రావు, ఏడుకొండలు, జి రమేష్, గుత్తుల మహేష్, శంకరరావు, పులపర్తి మహాలక్ష్మి, భీమనాధుని సత్యనారాయణ, పులపర్తి రంగారావు పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబువి కుట్ర రాజకీయాలు

రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు రాజకీయ జీవితం దాడులు, హత్యా రాజకీయాలకు పెట్టింది పేరని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. తణుకులో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో బహిరంగ సభలో చంద్రబాబు సీఎం జగన్‌ను ఉద్దేశిస్తూ 'కోడికత్తి, గులకరాయి అయిపోయాయి ఇప్పుడు నిన్ను లేపేస్తే ఏమవ్వద్ది' అంటూ వ్యాఖ్యలు చేయడంతో చంద్రబాబు ఎంత దుర్మార్గుడో అర్థమవుతుందన్నారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా ఎదిగిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భౌతికంగా లేకుండా చేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నాడని విమర్శించారు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో వేరొకరిని ఎదగనీయడని గతంలో ప్రజలకు దగ్గరైన వంగవీటి మోహనరంగాను, మల్లెల బాబ్జిని పొట్టన పెట్టుకుంది నువ్వు కాదా చంద్రబాబూ అని ప్రశ్నించారు. నీ బావమరిది బాలకృష్ణ కూడా ఇటీవల చస్తావు అంటూ జగన్‌ను ఉద్దేశించి మాట్లాడడం కూడా చంద్రబాబు కుట్రలో భాగమేనన్నారు. నీకు అడ్డొచ్చిన వారందరినీ కడతేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నావని, రాజకీయంగా ఎదుర్కొనలేక ఇలా కుట్రలకు చంద్రబాబు తెరతీస్తున్నాడని స్పష్టం చేశారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

టిడ్కో గృహాల కాలనీలో గుడాల గోపి ప్రచారం



పెంకుళ్లపాడులో టిడ్కో గృహాల సముదాయంలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: నవరత్నాల పథకాల ద్వారా రానున్న ఐదేళ్లలో రెట్టింపు లబ్ధితో సంక్షేమ పథకాలు అందించనున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) కోరారు. పట్టణంలోని పెంకుళ్లపాడు టిడ్కో గృహాల సముదాయంలో ఆదివారం గోపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీ+4 అపార్టుమెంటులో ప్రతి ప్లాట్‌లో నివసిస్తున్న లబ్ధిదారులను గుడాల గోపి, ఆయన భార్య మంగతాయారు కలుసుకుని ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వైఎస్ జగన్ దృష్టికి టిడ్కో రుణాల రద్దు అంశాన్ని తీసుకువెళతానన్నారు. జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల గౌరవాధ్యక్షుడు ఎం.మైఖేల్‌రాజు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, సహాయ కార్యదర్శి కర్రా జయసరిత, నూర్‌బాషా సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు షేక్ చాంద్‌బీబీ పాల్గొన్నారు.

ప్రజానాయకుడు సీఎం జగన్

ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, ఎంపీ అభ్యర్థిని ఉమాబాల రోడ్‌షో



పోడూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

పోడూరు: ఇచ్చిన మాట నెరవేర్చే ప్రజానాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలతో కలిసి తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం నుంచి పోడూరు, ఆచంట మండలాల్లోని గ్రామాల్లో ఆయన రోడ్‌షో నిర్వహించారు. పండితవిల్లూరు, పోడూరు, కవిటం, గుమ్మలూరు, ఆచంట వేమవరం పెనుమంచిలి, కందరవల్లి, కరుగోరుమిల్లి, వల్లూరు, భీమలాపురం, కోడేరు, పెదమల్లం, కొడమంచిలి, ఆచంట గ్రామాల మీదుగా రోడ్ షో సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, ఉమాబాల మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో అప్పట్లో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమలు చేయడంతో రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు. తాజాగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మ్యానిఫెస్టోను కూడా ప్రజలంతా విశ్వసిస్తున్నారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేసి తనను ఆచంట ఎమ్మెల్యేగా, గూడూరి ఉమాబాలను నరసాపురం ఎంపీగా గెలిపించాలని శ్రీరంగనాథరాజు కోరారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ నబ్బితి సుమంగళి సాగర్, ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పోడూరు మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఆచంట మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది సంక్షేమ ప్రభుత్వమే




రైతులతో ముచ్చటిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ ప్రభుత్వమేనని వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం మండలంలోని చినపుల్లేరు, పెదపుల్లేరు, వాండ్రం గ్రామాల్లో బైక్ ర్యాలీ ద్వారా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో పూల వర్షం కురిపిస్తూ పీవీఎల్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రచారంలో కనిపించిన రైతులు, మహిళలు, విద్యార్థులతో ఎన్నికల మేనిఫెస్టోపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టో రూపొందించారన్నారు. జగన్ పాలనలో ప్రతి ఇంటికీ మంచి జరిగిందన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, సర్పంచ్‌లు పెన్మత్స సావిత్రమ్మ, కరణం పార్వతీవెంకటేశ్వర్లు, దాసరి వెంకటకృష్ణ, గలావిల్లి ధనుంజయ, బొర్రా తాతయ్య, దండా రమేష్, సోడదాసి జీవరత్నం పాల్గొన్నారు.

రెండు మోటార్‌సైకిళ్ల ఢీ

- వ్యక్తి మృతి, మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- అలంపురం హైవే వద్ద ఘటన



గాయాలతో ఘటనా స్థలంలో ఉన్న ఎం. రాజు



గాయాలపాలైన పి.నాగరాజును తణుకు ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

పెంటపాడు: అలంపురం వద్ద జాతీయ రహదారిపై రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పెంటపాడు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు చెందిన మాడు రాజు (45) ఆదివారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై గూడెం వైపు వెళుతున్నాడు. అలంపురం వద్ద అదే రోడ్‌లో అలంపురం వైపు రాంగ్ రూట్‌లో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న నాగరాజు ఇతనిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డు డివైడర్‌పై పడిపోయిన రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజుకు కూడా స్వల్పగాయలు అయ్యాయి. వీరిద్దరిని హైవే అంబులెన్స్‌లో తణుకు ఆసుపత్రికి తరలిస్తుండగా తణుకుకు చెందిన రాజు మృతి చెందాడు. మృతుని కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెంటపాడు పోలీసులు తెలిపారు.

బైరెడ్డి పర్యటనను జయప్రదం చేయండి



కె దినేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చింతలపూడి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. చింతలపూడిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధార్థరెడ్డి పర్యటన వివరాలను తెలియజేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు కైకలూరు పార్టీ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరి శ్రీసీతారామ కన్వెన్షన్ హాల్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడి నుంచి దెందులూరు చేరుకుని మధ్యాహ్నం 3 గంటలకు గోపన్నపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం 4.30 గంటలకు గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మద్ది అంజనన్నను దర్శించుకుని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నుంచి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి కె సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులతో కలిసి భారీ ర్యాలీగా జంగారెడ్డిగూడెం గంగానమ్మ గుడి సెంటర్ వద్దకు చేరుకుని ఎన్నికల బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ఏలూరు జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని దినేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

అత్తిలి: ఇటీవల రేలంగిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అత్తిలి గోగులమ్మపేటకు చెందిన రౌతు చంద్రమణికంఠ కుటుంబ సభ్యులను మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం రాత్రి పరామర్శించారు. రాజమండ్రిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణికంఠ ఆరోగ్య పరిస్థితిని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఫోన్‌లో వైద్యులను సంప్రదించి ఆరా తీసారు. బాధితుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా నిలుస్తానని, ఈవిషయాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మీకు అండగా ఉంటానని మంత్రి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, దాసరి శ్రీను, బల్లిపాడు సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, కురెళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొల్లి రమావతికి సాధనశ్రీ జాతీయ పురస్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవా సంస్థ, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి (తాడేపల్లిగూడెం)కి కన్నడ సాహితీ సంస్థ ద్వారా సాధన శ్రీ జాతీయ పురస్కారం అందుకోనున్నారు. తెలుగు–కన్నడ ద్విభాషా కవితా గోష్టి మే 5వ తేదీన ఆదివారం హైదరాబాద్‌లోని కర్ణాటక సాహిత్య మందిరంలో నిర్వహించనున్నారు. ఈ కవితా గోష్టిలో కొల్లి రమావతి పాల్గొనడంతో పాటు పురస్కారం తీసుకోనున్నారు. పురస్కారం అందుకుంటున్న రమావతికి పలువురు అభినందనలు తెలిపారు.

మహిళా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాల్లో మే 1 నుంచి 7 వరకూ విద్యార్థులకు సైకాలజిస్టుల ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ సేవా సమితి కోఆర్డినేటర్ కే గిరీశ్వరరావు తెలిపారు. తణుకు సజ్జాపురంలోని మహిళా గ్రంథాలయంలో రామకృష్ణ సేవా సమితి, వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు నైతిక విలువలు, లైఫ్ స్కిల్స్, మేజిక్, డ్యాన్స్ కరాటే, చదరంగం, డ్రాయింట్, పెయింటింగ్, మొదలైన అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రంగస్థల కళాకారుల సంఘ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సంఘ 143వ సమావేశం ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గీతా మందిరం ప్రాంగణంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షులు సూరంపూడి వెంకట రమణ, ఏఐటీయూసీ నాయకులు డి.సోమసుందర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత చీఫ్ మేనేజర్ పి.వరదాచార్యులు, బోణం సుబ్రహ్మణ్యం, హేమ సుందర్, తదితరులు మాట్లాడారు. భవన నిర్మాణ నాయకులు పడాల శ్రీనివాస్‌కు గౌరవ సత్కారం, కళాకారులు దిర్శిపాముల వెంకటరత్నంనకు కళా సత్కారం, డాక్టర్ జి.గోపాలస్వామికి ఉద్యోగ సేవ పురస్కారం, సీనియర్ నటీ అంజలీదేవికి ఆర్థిక సత్కారం అందజేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన గావించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి కళాకారులు, ప్రముఖులు, ప్రజలు హాజరైయారు. సంఘ కార్యదర్శి వంశీ కృష్ణ, ఉపాధ్యక్షులు బాబూరావు, మురళీకృష్ణలు పర్యవేక్షించారు.

ఘనంగా కనక ముత్యాలమ్మ సేవా మహోత్సవం

పెంటపాడు: మండలంలోని ముదునూరుపాడు గ్రామ దేవత కనకముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు పురస్కరించుకొని ఆదివారం రాత్రి అమ్మవారి సేవా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవకమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మార్చి 23న అమ్మవారి మొదటిసేవ, ఏప్రియల్ 21న అమ్మవారి రెండోసేవ నిర్వహిస్తున్నట్లు ఏప్రియల్ 28న అమ్మవారి మూడోసేవ చేశామన్నారు. అయితే మే 18న అగమజాతర, 19న పాన్పు, తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవకమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతర మహోత్సాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

తణుకు అర్బన్: తణుకు 17వ వార్డులో శ్రీరామ, సాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయంలో సాయిబాబా 24వ వార్షికోత్సవంతో పాటు శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సాయి అన్నదాన సేవా కమిటీ ప్రతినిధులు మండ సూరిబాబు, అవ్వారి సత్యనారాయణ, కట్టా కిషోర్, సింహాద్రి రాజేష్, కామన శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, సప్పా బల రామకృష్ణ, వై.రామకృష్ణ, అబ్దుల్ ఖాదర్ జిలాని పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సూత్ర'దారి' కొట్టు

- తాడేపల్లిగూడెంలో అభివృద్ధిలో కొట్టు ముద్ర
- నియోజకవర్గ రూపురేఖలు మార్చిన ఘనుడు



కొట్టు హయాంలో ఏర్పడిన రెండో ఫ్లైవోవర్ వంతెన



కొట్టు హయాంలో తొలిసారి ఎమ్మెల్యే అయ్యినపుడు నిర్మించిన రాజీవ్ గృహకల్ప

తాడేపల్లిగూడెం: కొట్టు సత్యనారాయణ రెండు పర్యాయాలు తాడేపల్లిగూడెం శాసనసభ్యుడు. గూడెం అభివృద్ధి పథంలో పయనింపజేశారు. తనదైన మార్కు వేశారు. అభివృద్ధికి చిహ్నాలైన రహదారులను అందంగా తీర్చిదిద్దారు. ప్రతి సంక్షేమ పథకాన్ని కుల, మతాలకు అతీతంగా అందించారు. నియోజకవర్గంలో లెక్కలు మిక్కిలిగా అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గ రూపశిల్పిగా పేరొందారు.

మొదటి పంపుల చెరువు...

పట్టణంలో తాగునీటి అవసరాలను తీర్చడానికి గాను కరకట్ట ప్రాంతంలో ఈలి హయాంలో పంపుల చెరువు తవ్వించారు. పట్టణంలో 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పైపులైన్లలో నీరు సజావుగా కుళాయిలకు చేరేలా పంపుల చెరువు ఏర్పాటు చేశారు.

కొట్టు హయాంలో

ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారి కొట్టు సత్యనారాయణ పట్టణ ట్రాఫిక్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్ అవసరాలను బేరీజు వేసుకొని యాగర్లపల్లి కడకట్లను అనుసంధానం చేస్తూ రెండో ఫ్లైవోవర్ వంతెనను నిర్మించారు. 2005 రాజీవ్ నగరబాటలో ఈ వంతెన నిర్మాణానికి దివంగత సీఎం వైఎస్ హామీ నిచ్చారు. ఈ వంతెన నిర్మాణంలో భాగంగా కొంతభాగానికి రైల్వే డిపార్టుమెంటు నిధులు వెచ్చించాల్సి ఉంది. అదే సమయంలో ఏలూరు పార్లమెంటులో అంతర్భాగంగా ఉన్న గూడెం ఎంపీ కావూరి సాంబశివరావు ద్వారా ఆ నిధులు తీసుకురావాలని కోరారు. ఈ విషయాన్ని స్వార్థంతో కావూరి విస్మరించారు. ఇచ్చిన హామీ మేరకు కొట్టు కోరిక అనుసరించి ఈ నిధులను కూడా అప్పట్లో వైఎస్ రాష్ట్ర నిధులు ఇచ్చి వంతెనను పూర్తి చేశారు.

రెండో వేసవి జలాశయం

పట్టణం విస్తరించడం, శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య రావడంతో దీని పరిష్కారం కోసం కొట్టు సత్యనారాయణ చొరవ తీసుకొని కడకట్ల పరిధిలోని కడియపు చెరువును రెండోవేసవి జలాశయంగా రూ.32 కోట్లలతో శరవేగంగా పనులు చేయిస్తున్నారు.

వంతెనలు, ఇళ్లు

కొట్టు నాయకత్వంలో ఒక్క రెండోఫ్లైవోవర్ వంతెనే కాదు. గూడెం మండలంలో ఎర్రకాల్వపై మాధవరం, అప్పారావుపేట, వీరంపాలెం వద్ద వంతెనలు నిర్మించారు. ఇళ్ల విషయాని కొస్తే తొలిసారి ఎమ్మెల్యే అయ్యిన తర్వాత కొండ్రుపోలు పరిధిలో రాజీవ్‌గృహకల్ప పేరిట 280 ఇళ్లు నిర్మించారు. ప్రస్తుతం 5,635 మందికి టిడ్కో ఇళ్లను నిర్మించి ఇచ్చారు. ఉద్యానవర్సిటీ వంటి ఉన్నత విద్యా సంస్థలను ఇక్కడికి తీసుకురావడంతో పాటు, కోట్లాది రూపాయల అభివృద్ధిని నియోజకవర్గంలో చేశారు.

విద్యాహబ్‌గా తీర్చిదిద్దారు

వాణిజ్య కేంద్రంగా ఉన్న గూడెంను విద్యాహబ్‌గా మార్చడంలో కొట్టు సత్యనారాయణ కీలక భూమిక పోషించారు. వైఎస్ సీఎం అయ్యి రాజీవ్ పల్లెబాటలో భాగంగా గూడెం పర్యటనకు వచ్చినప్పుడు విమానాశ్రయ భూముల్లో వంద ఎకరాలు కేటాయించి ఏయూ క్యాంపస్‌కు శ్రీకారం చుట్టారు. ఆ క్యాంపస్ నేడు నన్నయ్య క్యాంపస్‌గా మారింది. దేశంలో రెండవదిగా ఉద్యాన విశ్వవిద్యాలయం, వెటర్నరీ పాలిటెక్నిక్ ఏర్పాటు చేశారు. పట్టణంలో మురుగునీటి సమస్యకు పరిష్కారంగా రూ.60 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి వన్‌టౌన్‌లో పూర్తి చేశారు. రాజీవ్ గృహకల్ప కింద 280, ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ కింద 480 ఇళ్లు కట్టించి ఇచ్చారు. గ్రామాలలో వేలాది ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు. ఎర్రకాల్వ ముంపుసమస్య నివారణలో భాగంగా బాపన్నకోడు, రామరాజు గట్టు పునర్నిర్మాణ పనులు చేశారు. తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసి 600 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశారు.

రెండో సారి ఎమ్మెల్యేగా మంత్రిగా

రెండోసారి ఎమ్మెల్యే డిప్యూటీసీఎం, దేవదాయ శాఖా మంత్రి అయిన తర్వాత 1030 కోట్ల రూపాయల సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించారు. చిలకంపాడు లాకుల దగ్గర నుంచి ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు రూ.36 కోట్లతో నాలుగులైన్ల రోడ్డును నిర్మించారు. గ్రామాలలో సచివాలయ, ఆర్‌బీకె, మిల్క్‌చిల్లింగ్, డిజిటల్ లైబ్రరీలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టారు. సుమారు రెండు వేల కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులు చేసి దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి కొట్టు కృషి చేశారు. నియోజకవర్గ రూపశిల్పిగా ఖ్యాతిగడించారు.

అభివృద్ధి ప్రదాత కొట్టు సత్యనారాయణ



సమర్థత కలిగిన నాయకుడు కొట్టు సత్యనారాయణ, పట్టణ అభివృద్ధి ప్రదాత. రెండో ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పట్టణానికి ఎంతో మేలు చేశారు. పట్టణంలో రౌడీయిజాన్ని అరికట్టారు. ఉద్యాన యూనివర్శిటీ, ఆంధ్రయూనివర్శిటీ క్యాంపస్, వెటర్నరీ పాలటెక్నిక్ తదితర అభివృద్ధి పనులు చేపట్టి నేటికి ప్రజల మనస్సులలో ఉన్నారు.

– ఎస్.ఎల్.బాషా, తాడేపల్లిగూడెం

పట్టున్న నాయకుడు కొట్టు



నియోజకవర్గం మీద పట్టున్న నాయకుడు కొట్టు సత్యనారాయణ. గ్రామాల అభివృద్ధితో పాటు రైతాంగ, రహదారి సమస్యలు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలపై అవగాహన కలిగి, అభివృద్ధి చేయగల సత్తా ఉన్న నాయకుడు.

– నీలపాల రామన్న, ఎల్.అగ్రహారం

రైతు సమస్యలు పరిష్కరించారు



రైతు సమస్యలకు పరిష్కారం చూపించారు. నందమూరు నుంచి బంగారుగూడెం వరకు ఎర్రకాల్వ వస్తుందంటే రైతుల గుండెల్లో రైళ్ల పరుగులు పెట్టేవి. రామరాజు గట్టు, బాపన్నకోడువంటి చెక్‌డ్యామ్‌ల పునర్నిర్మాణం చేపట్టారు. దీంతో రైతుల బాధకు ఉపశమనం కలిగింది.

– కాసగాని రామచంద్రరావు, పట్టింపాలెం

ప్రజల్లో నమ్మకాన్ని నింపిన జగన్



మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ



చినతాడేపల్లి గ్రామంలో మోటారు సైకిల్ ర్యాలీ

వైఎస్సార్ సీపీ గూడెం అభ్యర్థి 'కొట్టు'

తాడేపల్లిగూడెం రూరల్: చెప్పాడంటే చేస్తాడనే నమ్మకాన్ని ప్రజల్లో నింపిన వ్యక్తి సీఎం జగన్మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని చినతాడేపల్లి, కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చారన్నారు. తద్వారా రాజకీయాలకు కొత్త అర్థాన్ని నింపారన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయా ?లేదా ?అనే విషయాన్ని తెలుసుకోవడం కోసం ప్రతి ఇంటికి పంపించారని గుర్తుచేశారు. ఏడాదిన్నర పాటు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందని వారికి సైతం పథకాలు అందించామన్నారు. ప్రజా ప్రతినిధులను ప్రజల ముంగిటకు పంపించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో పండించిన ధాన్యాన్ని ఎటువంటి ఖర్చులు లేకుండా నేరుగా రైసు మిల్లులకు తరలిస్తున్నామన్నారు. క్వింటాలుకు రూ.1638లను ధాన్యం విక్రయించిన వారం తిరగకుండానే రైతు ఖాతాకు జమ చేశామన్నారు. మండలంలో ఇంకా ఇళ్ల స్థలాలు రాని వారికి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి స్థలాలు అందజేశామన్నారు. 58 నెలల పాలనలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి, నేడు ఓట్లు అడగటానికి ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. ఆ దమ్ము చంద్రబాబుకు ఉందా ? అని ప్రశ్నించారు. మళ్లీ తనకు ఒక అవకాశం ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తిరిగి జగన్‌కు ఓటేసే అవకాశం తనకు కల్పించాలని ప్రజల్ని వేడుకున్నారు. ఆక్వా కల్చర్ డవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు మాట్లాడుతూ శాంతిభద్రతలు బాగుండాలంటే కొట్టు సత్యనారాయణను తిరిగి గెలిపించాలన్నారు. తద్వారా నియోజకవర్గం మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. అలాగే ఎం.పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజల్ని కోరారు. మాజీ ఎమ్మెల్యే యీలి వెంకట మధుసూదనరావు (నాని) మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో అందరికీ ఆమోదయోగ్యంగా ఉందన్నారు. గతంలో అందించిన సంక్షేమ పథకాలకు రెట్టింపు రానున్న రోజుల్లో అందించేలా మేనిఫెస్టో రూపకల్పన చేశారన్నారు. జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందగలదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, దారపురెడ్డి దుర్గారావు, దూలపల్లి సత్తియ్య, సర్పంచ్‌లు యాతం కోటీశ్వరి, ఎలిపే గాంధీ, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ళ తాతారావు, పరిమి తుల సీదాస్, వెలిశెట్టి నరేంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, నాయకులు పిచ్చుకల శ్రీనివాసరావు, గొల్లపల్లి ధర్మరాజు, పిచ్చుకల అమ్మనరాజు, సంపతరావు కృష్ణారావు, గంటి చినసర్వేశ్వరరావు, కారింకి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారాలు



సూరంపూడి చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్ కుమార్



అత్తిలి శాసనాల వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు



తణుకు ఎన్జీవోస్ కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి కుమార్తె దీపిక

తణుకు టౌన్: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సతీమణి లక్ష్మీ కిరణ్ అన్నారు. ఆదివారం తణుకు మండలం మండపాక, దువ్వ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీలు పెనుమాక అశోక్, శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మండపాక సొసైటీ అధ్యక్షురాలు వైవీ విజయమూర్తి, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు కృష్ణంరాజు, యూత్ అధ్యక్షుడు చెట్టి సునీల్, పట్టణ మహిళా అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏడుకొండలు, కే సత్యనారాయణ, నరాల వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమం

ఇరగవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అందరికీ సంక్షేమం సాధ్యమైందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం తూర్పు విప్పర్రు, సూరంపూడి, ఓగిడి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఇంటిలో సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకోవా లన్నారు. అందుకు ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటు ముద్రను ఫ్యాన్ గుర్తు పై వేసి గెలిపించాలనన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటి అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, కోటి దిలీప్ కుమార్, బొల్లా సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామా పార్టీ అధ్యక్షులు, పాస్టర్లు సంఘ విశ్వాసులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని గెలిపించాలి....

తణుకు అర్బన్: తణుకు 7వ వార్డు ఎన్జీవోస్ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మంత్రి కారుమూరి కుమార్తె దీపిక పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో మంత్రి కారుమూరి ప్రజాసేవలో తణుకు నియోజకవర్గ ప్రజలందరికీ నిరంతరం అందుబాటులో ఉన్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, బీసీ సెల్ పట్టణ మహిళాధ్యక్షురాలు బెజ్జవరపు హేమ శ్రీ, డీజీ అమూల్యారావు, షేక్ బాజీ, డి.ప్రకాష్, బెజ్జవరపు సాక్షి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలి

అత్తిలి: భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి అత్తిలి తూర్పువీధి రామాలయంనుంచి రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ కుమార్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చినవి, ఇవ్వని హామీలను సైతం అమలు చేసి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికలలో తిరిగి గెలిపించుకోవాలన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమపాలనకు సుగమం ఏర్పడుతుందన్నారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తణుకు ఎమ్మెల్యేగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని పైబోయిన కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్,మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, మండలపార్టీ నాయకులు గారపాటి నాగరాజు, పోలినాటి చంద్రరావు, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, తమ్మాబత్తుల రాము, కంకటాల సతీష్, యడ్లపల్లి మణికుమార్, రంభ సూరిబాబు, రామిశెట్టి రాము, ఆకుల చినబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- జోరుగా ఎన్నికల ప్రచారం



ఇరగవరం: రేలంగిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: వీరభద్రపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి



అత్తిలి: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కారుమూరి

ఇరగవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇరగరం మండలం రేలంగి గ్రామంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రాష్ట్రం అవినీతిమయంగా మారిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో మరెన్నో పథకాలను అమలు చేశారన్నారు. వీటితో రాష్ట్రంలో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. కుల, మత, వర్గ విభేదం లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. రేలంగి గ్రామాన్ని టీడీపీ హయాంలో కంటే 10రెట్లు ఎక్కువగా అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని ఆమె అన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్‌గుర్తుకు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమలో సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, ఎంపీటీసీలు మహిళ అధ్యక్షురాలు గుడిమెట్ట కిరాణ్మయి, చీలీ మెంటరాజు, మహ లక్ష్మీ, గ్రామ పార్టీ అధ్యక్షులు పులుపు అనిల్, వార్డు నెంబర్ పులుపు సునీల్, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, వడ్డే మార్కేండేయులు, మైనం పాము, తాతపూడి బోస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమ అజెండాతోనే సీఎం జగన్ మ్యానిఫెస్టో

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అజెండాతోనే ప్రజల్లోకి వస్తున్నారని రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు 15వ వార్డు వీరభద్రపురంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. 2019లో ఇచ్చిన మాట ప్రకారం మ్యానిఫెస్టోని అమలుచేసి మళ్లీ అవే సంక్షేమ పథకాల లబ్ధిని రెట్టింపు చేసి 2024 ఎన్నికలకు మ్యానిఫెస్టోని ప్రకటించారని చెప్పారు. ఇందులో భాగంగా వైఎస్సార్ చేయూత పథకం రూ. 1.50 లక్షలకు పెంచారని, కాపు నేస్తం మొత్తాన్ని రూ. 1.20 లక్షలకు పెంచారని, వాహన మిత్ర పథకంలో భాగంగా ఏడాదికి రూ. 20వేలు చేశారని చెప్పారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సదుద్దేశ్యంతో సంక్షేమాన్ని రూపాయి లంచం లేకుండా అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరొక్కసారి గెలిపించుకుంటేనే పారదర్శకంగా సంక్షేమం అందుతుందని చెప్పారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థినిగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వార్డు నాయకులు గనసాల సింగ్, మల్లిపూడి వెంకట్రావు, నూతంగి సూర్యారావు, గానకాని రామయ్య, ఆచంట లక్ష్మణరావు, దాసరి రాంబాబు పాల్గొన్నారు.

అత్తిలి: తణుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం అత్తిలి మండలంలో గల పలు చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రానున్న ఎన్నికలలో ఘన విజయం చేకూర్చేలా ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొట్టు విజయానికి కృషి చేయాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి కుల సంఘ నాయకులు

పెంటపాడు: నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణ విజయానికి కృషి చేస్తామని రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం పెంటపాడులో రెడ్డి కులస్తుల ఆత్మీయ సమావేశాన్ని రైతుసంఘ నాయకులు, నల్లమిల్లి రాఘవరెడ్డి స్వగృహం వద్ద నిర్వహించారు. నియోజకవర్గ రెడ్డి సంఘ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రెడ్డి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొవ్వూరి నాగేంద్ర రెడ్డి, గుడిమెట్ల శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ మా సంఘం పూర్తి మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. నియోజక అభివృద్ధికి కంకణం కట్టుకొన్న దమ్మున్న నాయకుడు కొట్టు సత్యనారాయణ తెలిపారు. వచ్చే ఎన్నికలలో కూడా కొట్టు సత్యనారాయణ గెలుపు కోసం ఇతర సామాజిక వర్గాలతో కలిసి పనిచేస్తామన్నారు. అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యులు నల్లమిల్లి గాంధీరెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, గ్రంథాలయ అధ్యక్షుడు, ఏఎంసీ సభ్యుడు కర్రి వరహాలరెడ్డి, మాజీ కౌన్సిలర్ మేడపాటి జానార్ధన రెడ్డి పాల్గొన్నారు.

